సాక్షి
వైఎస్సార్ జిల్లా

బుధవారం ၊ 22 ၊ మార్చి ၊ 2023



ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలి
ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. -4లో..



ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం
ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎన్డీఆర్ఎఫ్ భద్రతా సిబ్బంది సంసిద్ధంగా ఉందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. -4లో..

వాతావరణం
గరిష్టం/కనిష్టం
34.4/23.2

జిల్లాలో మంగళవారం 23.2 - 34.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు
కడప సిటీ : జిల్లా ప్రజలకు శోభకృత్ నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ సుఖ శాంతులతో భోగ భాగ్యాలతో ఉండాలని, పల్లె సీమలు పశుసంపద, వ్యవసాయ, ఉద్యాన పంటలతో సుభిక్షంగా ఉండి కళకళలాడాలని వారు ఆకాంక్షించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి, మేయర్ సురేష్ బాబు, ఎస్పీ అన్బురాజన్, జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జేసీ సాయికాంత్ వర్మ, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఇతర ప్రజా ప్రతినిధులు జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అధికారి ఎంఎన్ రాణి ఒక ప్రకటనలో తెలిపారు. 18 అంగన్వాడీ కార్యకర్తలు, 49 సహాయకురాళ్లు, 4మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. 1.7.2023 నాటికి అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు దాటి 35 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు చివరి తేది ఈనెల 27గా గుర్తించాలన్నారు. 28వ తేది ఉదయం 11 గంటలకు ఆయా ఆర్డీఓ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. దరఖాస్తు ఫారంను కడప.ఏపీ.జీఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె అన్నారు.

24న జాబ్ మేళా
కడప కోటిరెడ్డిసర్కిల్: తమ కార్యాలయంలో ఈనెల 24వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ కంపెనీలో ఫార్మసిస్టు, రీటైల్ ట్రైనీ అసోసియేట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎం, బీ, డీ ఫామ్‌లు పూర్తి చేసిన యువతీ యువకులు ఇందుకు అర్హులన్నారు. అభ్యర్థులు 19-30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని, ఎంపికైన వారికి రూ. 10-20 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ధృవపత్రాలు, ఫోటోలు తీసుకుని కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో ఉదయం 10.00 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తిగల వారు తమవివరాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎన్‌సీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి
కడప ఎడ్యుకేషన్: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివినప్పుడే ఉన్నతస్థాయికి చేరుకోగలరని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప చిన్నచౌక్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులతో మోటివేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థానానికి చేరుకోవాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతోపాటు ఆట పాటలు ముఖ్యమేనన్నారు. రెగ్యులర్‌గా పాఠ్యపుస్తకాలే కాకుండా సమాజం గురించి, జరిగే సంఘటనల గురించి కూడా తెలుసుకోవాలన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారి మిట్టా కేశవ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వేలాంగిణికి ప్రత్యేక బస్సులు



కడప కోటిరెడ్డి సర్కిల్ : ఏపీ ఎస్ ఆర్టీసీ కడప రీజియన్ పరిధిలోని బద్వేలు, మైదుకూరు డిపోల నుంచి వేలాంగిణికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి 7.00 గంటలకు మైదుకూరు నుంచి (సర్వీసు నెంబరు 93263) బయలుదేరి 8.00 గంటలకు కడప, మరుసటిరోజు ఉదయం 10.00 గంటలకు వేలాంగిణికి చేరుతుందన్నారు. తిరిగి వేలాంగిణిలో ఆదివారం ఉదయం 11.00 గంటలకు బయలుదేరి నాగూరు, నాగపట్నం, చిదంబరం మీదుగా మరుసటిరోజు ఉదయం 5.00 గంటలకు బస్సు మైదుకూరుకు చేరుతుందన్నారు. అలాగే బద్వేలులో (సర్వీసు నెంబరు 930061) రాత్రి 7.00 గంటలకు బయలుదేరి కడప మీదుగా నాన్‌స్టాప్‌గా వేలాంగిణికి మరో బస్సు చేరుతుందన్నారు. ప్రయాణీకులకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని తెలిపారు.

గోరుముద్దతో ఆరోగ్యం





ముఖ్యమంత్రి వీసీ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ విజయరామరాజు, రాష్ట్ర ఆహార సలహా మండలి చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు లక్ష్మీదేవి, విద్యార్థినికి రాగి జావ అందజేస్తున్న దృశ్యం

- కలెక్టర్ విజయరామరాజు
- రాగి జావ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీఎం వైఎస్ జగన్

కడప సిటీ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు విద్య, మేధో వికాసంతోపాటు పోషక విలువలతో కూడిన ఆహారంతో ఆరోగ్య సంపన్నులుగా చేయడమే జగనన్న గోరుముద్ద-రాగిజావ లక్ష్యమని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద ద్వారా బడిపిల్లలకు వారానికి మూడు రోజులు ఉదయం పూట రాగి జావ అందించే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక వీసీ హాలు నుంచి కలెక్టర్ విజయరామరాజుతోపాటు రాష్ట్ర ఆహార సలహా మండలి చైర్మన్ చిత్తా విజయ్‌ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు లక్ష్మీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి వీసీ అనంతరం విద్యార్థినులకు రాగిజావ పంపిణీ తర్వాత వారు మాట్లాడారు.

జిల్లా వ్యాప్తంగా 2048 పాఠశాలల్లో 1,48,804 మంది విద్యార్థులకు రాగిజావ

కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా నూతనంగా రాగి జావ పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2048 పాఠశాలల్లో 1,48,804 మంది విద్యార్థులకు ఈ రాగిజావ అందనుందన్నారు. అందులో 1621 ప్రాథమిక పాఠశాలలు, 171 ప్రాథమికోన్నత పాఠశాలలు, 256 ఉన్నత పాఠశాలల్లో ఈ గోరుముద్ద పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ ప్రకారం రుచికరమైన జగనన్న గోరుముద్ద పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం అందించే అనేక రకాల విద్య, సంక్షేమ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. తద్వారా ఉన్నత లక్ష్యాలతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సందేశమిచ్చారు.

జగనన్న గోరుముద్ద పథకానికి ఏడాదికి రూ. 1824 కోట్లు

రాష్ట్ర ఆహార సలహా మండలి చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ఏడాదికి రూ. 1824 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు. అదే పథకం ద్వారా రాగి జావ సరఫరాకోసం ప్రతి యేటా మరో రూ.86 కోట్లను అదనంగా వెచ్చించనుందన్నారు.

- అనంతరం వారు అక్కడికి హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేయడంతోపాటు వారు కూడా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాఘవరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, విద్యాశాఖాధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరంలా భావిస్తున్నాం



జగనన్న గోరుముద్ద పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం వరంలా భావిస్తున్నాం. భగత్‌సింగ్ కాలనీ నుండి రోజూ పాఠశాలకు వస్తున్న నాకు ఐరన్, క్యాల్షియం అధికంగా ఉన్న రాగిజావ నాకెంతో ఉపయోగపడుతుంది. ఇంటివద్ద రోజూ రాగి జావ చేసుకునే అవకాశం లేకపోవడంతో స్కూళ్లలో ఇచ్చే రాగి జావ మాలాంటి వారికి వరంలా భావిస్తున్నాం. - జి.శివప్రియ, 9వ తరగతి, జెడ్పీజీహెచ్, చెమ్ముమియాపేట, కడప

గోరుముద్ద ఆరోగ్య ఆహారం



గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇలాంటి సదుపాయం కల్పించలేదు. మాలాంటి పేద వారికి ఉన్నత చదువులు చదువుకునే వారికి ముఖ్యమంత్రి కల్పిస్తున్న గొప్పవరం అమ్మ ఒడి. తద్వారా మా తల్లిదండ్రులకు భారం తగ్గింది. జగనన్న గోరుముద్ద ద్వారా రుచికరమైన ఆహారం అందుతోంది. అందుకే ఆరోగ్యంగా ఉన్నాం. - ఎ.మౌనిక, 9వ తరగతి, జెడ్పీజీహెచ్, చెమ్ముమియాపేట, కడప

జగన్ మామయ్య గ్రేట్



విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వస్తోంది. విద్యతోపాటు జగనన్న గోరుముద్ద ద్వారా బలవర్ధకమైన ఆహారం అందించడంతో పాటు రాగి జావ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన జగన్ మామయ్య గ్రేట్. విద్యా ప్రదాతగా ఆంధ్ర రాష్ట్ర చరిత్రలోనే ఆయన సుస్థిర స్థానం సంపాదించారు. - కె.భ్రమరాంబిక, జెడ్పీజీహెచ్, చెమ్ముమియాపేట, కడప

రాగి జావ ఉపయోగకరం



మాలాంటి పేద విద్యార్థులకు పోషకాహార లోపం లేకుండా జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాకుండా రాగిజావ కూడా అందించడం మాలాంటి వారికి ఎంతో ఉపయోగకరం. కుటుంబంలో మంచి పోషకాహారం పిల్లలకు అందని వారిని చాలామందిని చూశాం. నిజంగా రాగిజావ అందించడం పేద విద్యార్థులకు వరం లాంటిది. - ఎస్.తస్లీమ్, 9వ తరగతి, జెడ్పీజీహెచ్, చెమ్ముమియాపేట, కడప

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 96.22 శాతం హాజరు
- ముగ్గురు విద్యార్థులు డిబార్




ఆన్‌లైన్ ద్వారా పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఇంటర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మంగళవారం నిర్వహించిన ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షకు 96.22 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 92 పరీక్ష కేంద్రాలలో గణితం, బాటనీ, సివిక్స్ పరీక్షలకు 22,088 మంది విద్యార్థులకుగాను 21,255 మంది హాజరుకాగా 833 మంది గైర్హాజరయ్యారు. కమలాపురంలోని వేరు వేరు పరీక్షా కేంద్రాలలో ఇద్దరు, బ్రహ్మంగారిమఠం పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు ఆర్ఐఓ రమణరాజు తెలిపారు. కడప నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్ బోర్డు పరిశీలకుడు జేవీ రమణ తనిఖీ చేశారు. ఆర్ఐఓ రమణరాజు బద్వేల్, బ్రహ్మంగారి మఠం ప్రాంతంలోని పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ప్రకాష్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్‌వర్మలు పలు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్మీడియట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రవి ఆర్ఐఓ కార్యాలయం నుంచి ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించి అధికారులు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు.

కేజీబీవీలో మిగిలిన సీట్లకు నోటిఫికేషన్ విడుదల
కడప ఎడ్యుకేషన్: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలలో(కేజీబీవీ) 2023-24 విద్యా సంవత్సరానికి 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు. అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష రూపుమాపేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

కడప సిటీ : ఎస్సీ ఎస్టీలపై వివక్ష రూపుమాపేందుకు కృషి చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. జేసీ సాయికాంత్‌వర్మ, ఎస్పీ అన్బురాజన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాశ్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా జరిగే మొదటి స్పందన కార్యక్రమంలో మొదటి గంటలో ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తామన్నారు. ఎస్సీ ఎస్టీలపై అత్యాచారాలు జరిగినపుడు వెంటనే ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలన్నారు. ఎస్పీ అన్బురాజన్ మాట్లాడుతూ రెసిడెన్షియల్ హాస్టళ్లలో ప్రతిరోజు సాయంత్రం పోలీసుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. పోక్సో చట్టంపై అవగాహన చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జేసీ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీలకు స్మశాన వాటికలు లేని 138 గ్రామాలను గుర్తించామన్నారు. ఇందులో 104 గ్రామాలకు స్మశాన వాటికలకోసం 70 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు వెంకట కిశోర్, నాగన్న మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓలు ధర్మచంద్రారెడ్డి, వెంకట రమణ, వెంకటేశు, డీఎస్పీ శివారెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి బ్రహ్మయ్య, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, నాగరాజు, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మినీ బస్టాండుకు స్థల పరిశీలన

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని జెడ్పీ కాంప్లెక్స్ వెనుక వైపు మినీ బస్టాండుకు కలెక్టర్ విజయరామరాజు స్థల పరిశీలన చేశారు. మంగళవారం ఆయన జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డిలతో కలిసి స్థల పరిశీలన చేశారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హసీనా ఖర్బికు కేసీపీ సేవారత్న పురస్కారం



సేవారత్న అవార్డు అందుకుంటున్న హసీనా ఖర్బి

ప్రొద్దుటూరు కల్చరల్: మహిళల అక్రమ రవాణాను అడ్డుకుని 72 వేల మంది పైగా మహిళల్ని కాపాడిన మేఘాలయాకు చెందిన హసీనా ఖర్బికు కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరులోని కేసీ పుల్లయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో మంగళవారం కేసీ పుల్లయ్య 11వ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కేసీ పుల్లయ్య హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభోత్సవంతో పాటు ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఎంబీబీఎస్, పాలిటెక్నిక్ చదువుతున్న దాదాపు 500 మంది పైగా ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందచేశారు. అలాగే వివిధ రంగాల్లో విశేష కృషి చేసినవారికి జాతీయ పురస్కారాలు అందజేశారు. హసీనా ఖర్బితో పాటు దాదాపు 200 మంది పైగా ట్రాన్స్ జెండర్లు చదువుకుని తమ కాళ్లమీద తాము నిలబడటానికి కృషి చేసిన తిరువనంతపురానికి చెందిన శ్రీకుట్టి నమితకు విద్యారత్న అవార్డు, ఆర్మీలో పనిచేసి యుద్ధంలో పాల్గొని వెన్నముక దెబ్బతిని కాళ్లుచేతులు పనిచేయక పోయినా ఆత్మస్థైర్యంతో నోటితో కుంచె పట్టి చిత్రాలు గీస్తున్న చిత్రకారుడు భీమ్‌కుమార్ కర్కికు కళారత్న అవార్డు, అనంతపురానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు కళ్యాణ్ అక్కిపెద్దిలకు హరితరత్న అవార్డు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ కె.అనిల్ కుమార్, కార్యదర్శి సుశీల్‌కుమార్, కెసీ.పుల్లయ్య సతీమణి కృష్ణవేణమ్మ, సీఈఓ సుధా చల్లా పాల్గొన్నారు.

31లోపు నమోదు చేసుకోవాలి
కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు నర్సింగ్ హోమ్స్, ఆస్పత్రులు, క్లినిక్‌లు, ల్యాబ్‌లు, పాలీ క్లినిక్, డెంటల్ క్లినిక్స్, ఫిజియోథెరపీ క్లినిక్‌లు డబ్ల్యు డబ్ల్యు డబ్ల్యు క్లినికల్ ఎస్టాబ్.ఏపీజీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీలోపు నమోదు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. గడువు అనంతరం రెన్యూవల్ నమోదుకు ఈ పోర్టల్ ద్వారా వీలు పడదన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల ఎండీలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేయని ఆస్పత్రులపై చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రొద్దుటూరు రూరల్ సీఐ వీఆర్‌కు బదిలీ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ సీఐ మధుసూదన్‌గౌడ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయనతోపాటు ఏఎస్ఐ అహమ్మద్‌బాషాను బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ప్రొద్దుటూరులో కొంత కాలం నుంచి కర్ణాటక డీజిల్, బయోడీజిల్, వైట్ కిరోసిన్ విక్రయాలు పెద్ద ఎత్తున జరుగున్నాయి. కొందరు వాహన యజమానులు కర్ణాటక రాష్ట్రం నుంచి డీజిల్‌ను తెప్పించుకొని నిల్వ చేసుకుంటున్నారు. దీనిపై గతంలో ఒక సారి ఎస్పీ అన్బురాజన్ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. అయినా డీజిల్ విక్రయాలు ఆగలేదు. ఇటీవల టూ టౌన్, వన్ టౌన్ సీఐలు ఇబ్రహీం, రాజారెడ్డితోపాటు రెవెన్యూ, పౌరసరఫరాల సంస్థ, కొలతలు తూనికల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున కర్ణాటక డీజిల్, వైట్ కిరోసిన్‌ను సీజ్ చేశారు. కర్ణాటక డీజిల్‌ను నిల్వ చేసిన నలుగురిపై కేసులు నమోదు చేశారు. ఈ క్రమంలోనే సీఐని వీఆర్‌కు బదిలీ చేసినట్లు పోలీసు శాఖలో చర్చ జరుగుతోంది. రూరల్ సీఐ ఇంకా రిలీవ్ కాలేదు. మూడు రోజులు సెలవులో వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

కేసీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

మైదుకూరు : మైదుకూరు వద్ద కాలువ కొండపేట చానల్‌లో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. స్థానిక నంద్యాల రోడ్డులో కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారిపై ఉన్న కాలువ బ్రిడ్జి వద్ద లష్కర్లు కాలువలో పెరిగిన గుర్రపు డెక్కల మొక్కలను జేసీబీతో తొలగిస్తుండగా వాటి మధ్యలో మృతదేహం ఇరుక్కుని ఉండటాన్ని గమనించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి వెలికి తీయించి అక్కడే పోస్టుమార్టం చేయించారు. మృతి చెందిన వ్యక్తి ఒంటిపై కేవలం చొక్కా మాత్రమే ఉంది. మృతునికి 45 ఏళ్లలోపు వయసు ఉండొచ్చని భావిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని అతనిది ఏ ఊరు, ప్రమాదవశాత్తు కాలువలో పడి మరణించాడా, లేక వేరే కారణంతో మృతి చెందాడా అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

భర్తే హత్య చేశాడని మృతురాలి బంధువులు ఆందోళన


మృతిచెందిన భార్గవి

బద్వేలు అర్బన్ : భర్త పెట్టే వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం బద్వేలు పట్టణంలో చోటు చేసుకుంది. అయితే భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని మృతురాలి బంధువులు నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన నిర్వహించారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

బద్వేలు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన గంగిబ్రహ్మారెడ్డి, వెంకటసుబ్బమ్మల కుమార్తె అయిన పెద్దిరెడ్డి భార్గవి (28) బి.కోడూరు మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. ఈమెకు పదేళ్ల క్రితం బి.కోడూరు మండలం తంగేడుపల్లెకు చెందిన వెంకటసుబ్బారెడ్డితో వివాహం జరిపించారు. వీరికి ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. వారు రెండేళ్లుగా బద్వేలు పట్టణంలోని కొండారెడ్డి వీధిలో నివసిస్తున్నారు. కుమారుడు బుద్ధిమాంద్యంతో పుట్టడంతో వెంకటసుబ్బారెడ్డి ఏడేళ్లుగా భార్యను వేధిస్తుండే వాడు. ఈ క్రమంలో అనేక సార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అయినా వెంకటసుబ్బారెడ్డిలో మార్పు రాకపోవడంతో భార్గవి సర్దుకుని పోతుండేది. అయితే మూడు రోజుల క్రితం భార్గవి తన మేనల్లుడి పుట్టిన రోజు వేడుకలకు చెముడూరుకు వెళ్లింది. తర్వాత మరుసటి రోజు సాయంత్రం భార్గవిని తన తండ్రి తీసుకు వచ్చి బద్వేలులోని ఆమె ఇంటి వద్ద వదిలి వెళ్లాడు. అయితే మంగళవారం ఉదయం వెంకటసుబ్బారెడ్డి తనకు ఫోన్ చేసి.. ‘ మీ కుమార్తె చనిపోయిందని చెప్పడంతో.. తాను బద్వేలుకు వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉంది’ అని మృతురాలి తండ్రి గంగిబ్రహ్మారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ జి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బంధువుల ఆందోళన

తన కుమార్తె ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, భర్తే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన చేపట్టారు. సుమారు అరగంట పాటు ఆందోళన చేపట్టడంతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న అర్బన్ ఎస్ఐలు వెంకటరమణ, శ్రీకాంత్‌లు మృతురాలి బంధువులతో మాట్లాడి శాంతింపజేయడంతో ఆందోళన విరమించారు. నిష్పక్షపాతంగా విచారించి తమ కుమార్తెను చంపిన అల్లుడిపై, ఇందుకు సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు

మృతురాలి తండ్రి బ్రహ్మారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 498(ఏ), 306, 201 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

\- జి.వెంకటేశ్వర్లు, అర్బన్ సీఐ

ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సిటీ : ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్ భద్రతా సిబ్బంది సంసిద్ధంగా ఉందని డీఆర్వో గంగాధర్‌గౌడ్ తెలిపారు. వారు కల్పించే అవగాహన కార్యక్రమాల నిర్వహణకు పోలీసు, ఫైర్, రెవెన్యూ, అన్నిశాఖల అధికారులు సహకరించాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండెంట్ శివకుమార్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా చీఫ్ ఫైర్ ఆఫీసర్ జీవీఎస్ రాంప్రకాశ్‌లతో కలిసి డీఆర్వో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, మాక్ ఎక్స్‌పర్‌మెంట్ ద్వారా ప్రజలకు, ఆయా ఉత్పాదక సంస్థలు, ఫ్యాక్టరీల్లోని సిబ్బందికి అవగాహన కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై డీఆర్వో వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు జాతి విపత్తుల నిర్వహణ టీమ్ అన్ని జిల్లాల్లో మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా మన జిల్లాలో కెమికల్, బయోలాజికల్, రేడియో లాజికల్, న్యూక్లియర్ ఉత్పాదక ప్రాంతాల్లో హానికర, ప్రభావిత అవకాశాలను గుర్తించేందుకు సంబంధిత శాఖల అధికారులు, ఫ్యాక్టరీల నిర్వాహకులు సంబంధిత ప్రాంతాల్లో భాగస్వామ్యం కలిగిన, మిషనరి జిల్లా అథారిటీస్, స్థానిక సంస్థలు, సామాజిక స్వచ్ఛంద కార్యకర్తలు, సీఏపీఎఫ్, ఇతర భాగస్వాములతో కలిసి పలు చోట్ల సామాజిక, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించిన నిర్వహణ తేదీలను కూడా తెలియజేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ టీం ప్రతినిధులు రామకృష్ణ, ఏఆర్ పోలీసు, విద్యుత్‌శాఖ, డీఎంహెచ్‌ఓ నాగరాజు, పరిశ్రమల శాఖ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

టాటా మోటార్స్ కార్ల షోరూం ప్రారంభం


టాటా మోటార్స్ హరూన్ కార్ల షోరూం ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్యేలు

కడప కార్పొరేషన్ : టాటా మోటార్స్ అతి పెద్ద హరూన్ కార్ల షోరూం కడపకు రావడం శుభ పరిణామమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. నగర శివారులోని తిరుపతి– హైదరాబాద్ హైవేలో మోడమీదపల్లె వద్ద హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ అహ్మద్‌బాషా నూతనంగా స్థాపించిన టాటా మోటార్స్ ప్యాసింజర్ కార్ల షోరూంను ఆర్‌సీఎఫ్ఐ కమర్షియల్ ఈవీ వెహికల్స్ హెడ్ రమేష్ దొరై రాజన్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ జకియా ఖానం, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి, కడప మేయర్ కె.సురేష్ బాబుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి షోరూం, విడి భాగాల విభాగం, మెకానికల్ విభాగాలను ఆరంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ జిల్లాలో విశాలమైన, అత్యాధునిక సదుపాయాలతో ఈ కార్ల షోరూం ఏర్పాటైందని, అద్భుతమైన ఫీచర్స్, మోడరన్ టెక్నాలజీతో కొత్త నెక్సాన్ ఈవీ, టిగార్ ఈవీలతోపాటు హారియెర్ డార్క్ వెహికల్, సఫారి డార్క్ నూతన ఎడిషన్లు అందుబాటులోకి తెచ్చారన్నారు. అనంతరం కొత్తగా వాహనాలను కొనుగోలు చేసిన వినియోగదారులకు తాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్లు ముంతాజ్ బేగం, నిత్యానందరెడ్డి, పాకా సురేష్ కుమార్, జమాల్‌వలీ, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో నిందితులకు జైలు

నెల్లూరు(లీగల్) : నకిలీ పేర్లతో సొసైటీని స్థాపించి ప్రజలను మోసగించారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి నాలుగేళ్ల జైలు శిక్ష, మరో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని మంగళవారం తీర్పు చెప్పారు. వారిలో వైఎస్సార్ కడప జిల్లా, మైదుకూరు, బసవపురం గ్రామానికి చెందిన బైరి మారుతీ ప్రసాద్, మైదుకూరులోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన తిరువాయిపాటి రమేష్‌లకు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా, నాగాలాండ్‌లోని దిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన సెంథికుమ్లా, హైదరాబాద్‌కు చెందిన అప్పల మహేష్, ఆత్మకూరులోని రావకొల్లు గ్రామానికి చెందిన ఆత్మకూరు రాముకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సెంథికుమ్లాతో పాటు పై నిందితులందరూ మారు పేర్లతో 2011 ఆగస్టు 3న యూత్ అలైవ్ సొసైటీని స్థాపించారు. హైదరాబాద్‌తో పాటు కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలువురు ఏజెంట్లను నియమించుకుని ప్రజల నుంచి నెలకు రూ.11 వేల చొప్పున మూడు నెలలు చెల్లిస్తే ఆరు నెలల అనంతరం కట్టిన రొక్కానికి మూడో వంతు చెల్లిస్తామని నమ్మించి రూ.కోట్ల నగదును వసూలు చేశారు. మొదట కొందరికి చెల్లించి అనంతరం అర్ధాంతరంగా సొసైటీని మూసివేసి పరారయ్యారు. దీంతో లబ్ధిదారుడు అరవ రమేష్ ఫిర్యాదు మేరకు నెల్లూరు సీఐడీ డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ అయ్యపరెడ్డి కేసు వాదించారు.

జాతీయ స్థాయిలో అవార్డు సాధించడమే లక్ష్యం

'సాక్షి'తో సినీ నటుడు నాగ మహేష్ వెల్లడి



పులివెందుల టౌన్/రూరల్ : జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడమే లక్ష్యంగా సినిమాలలో నటిస్తున్నట్లు సినీ నటుడు నాగ మహేష్ పేర్కొన్నారు. పులివెందులలో ఓ సినిమా షూటింగ్ సందర్భంగా ఆయన ‘సాక్షి’తో మంగళవారం తన మనోభావాలు పంచుకున్నారు. 2016లో మెగాస్టార్ చిరంజీవి నటించిన ఖైదీ నెంబర్ 150 సినిమాలో తనకు సినిమా అవకాశం వచ్చిందన్నారు. అప్పటి నుంచి రంగస్థలం, అరవింద సమేత, గాడ్ ఫాదర్, అఖండ, వీరసింహారెడ్డి, సార్ సినిమాలతోపాటు సుమారు 60 సినిమాలలో పలు పాత్రలలో నటించానని పేర్కొన్నారు. గాడ్ ఫాదర్, ఖైదీ నెంబర్ 150 సినిమాలతోపాటు అఖండ, వీరసింహారెడ్డి సినిమాలు తనకు మంచి గుర్తింపు తెచ్చి పెట్టాయన్నారు. కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లో పుట్టిన నాకు చిన్నప్పటి నుంచి సినిమాలో రాణించాలన్న ఆసక్తితో నాటకాలలో ప్రదర్శనలు చేశానని చెప్పారు. తనకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించిన సినీ రంగంలోని పెద్దలకు, నటీనటులకు, స్నేహితులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్ట్

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో శాస్త్రినగర్‌కు చెందిన మునికుమార్‌పై మూడు రోజుల క్రితం అజీజ్ కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తాను ఇంటిలో వుండగా అజీజ్, తన కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండగా చూశానని, తన ఇంటిపైకి వచ్చి ఘర్షణ పడి కత్తితో దాడి చేసి, గాయపరిచాడని మునికుమార్ తెలియజేశాడు. ఈ మేరకు అజీజ్‌తోపాటు అతని తల్లి ఫాతిమా, సోదరుడు ఇంతియాజ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ముగ్గురిని మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

రూ.60 వేలు అపహరణ

ముద్దనూరు : స్థానిక వెంకటరెడ్డి కాలనీలో సురేష్ అనే వ్యక్తి ఇంటిలో రూ.60 వేల చోరీ జరిగింది. ఎస్ఐ చంద్రమోహన్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సురేష్ తన భార్యతో కలిసి సోమవారం బయటకు వెళ్లారు. మంగళవారం ఉదయం అతని తల్లి ఇంటికి వచ్చి చూడగా వాకిలి తాళం పగలగొట్టి వుంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు పగలగొట్టి అందులో వుంచిన రూ.60 వేలను దొంగలించినట్లు గుర్తించింది. సోమవారం రాత్రి 11 గంటల తర్వాత చోరీ జరిగి వుండవచ్చని భావిస్తున్నారు. క్లూస్ టీం వచ్చి పరిశీలించింది. మంగళవారం సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలిన చౌడు మిద్దె

త్రుటిలో తప్పిన ప్రమాదం


ఇంటి మిద్దె పై కప్పు కూలిన దృశ్యం


ఖాజీపేట : పాత కాలం నాటి చౌడు మిద్దె ఇంటిలో అందరూ నిద్రిస్తుండగా కూలిపోయింది. ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఖాజీపేట మండలం బి.కొత్తపల్లె పంచాయతీలోని కుమ్మర కొట్టాలు గ్రామంలో జంపన గంగాధర్‌రెడ్డికి పాత కాలం నాటి చౌడు మిద్దె ఉంది. రెండు రోజులుగా కురిసిన వర్షానికి మిద్దె పూర్తిగా తడిసి పోవడంతో తెల్లవారుజామున 3 గంటలకు పై కప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఇంటిలో గంగాధర్‌రెడ్డి, ఆయన భార్య శివమ్మ నిద్రిస్తున్నారు. అయితే వారి మీద పై కప్పు పడక పోవడంతో స్వల్ప దెబ్బలతో బయట పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకుని ఇంటిలోని వారిని సురక్షితంగా బయటకు తీసుకు వచ్చారు. పెను ప్రమాదం తప్పడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై టీడీపీ వర్గీయుల దాడి


ఆసుపత్రిలో శ్రీనివాసరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని దొడియం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీనివాసరెడ్డిపై టీడీపీకి చెందిన సుబ్బరాయుడు (రౌడీషీటర్) సుధాకర్ కలిసి సోమవారం రాళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నాయకుడు గెలవడంతో గ్రామానికి చెందిన వీరు శ్రీనివాసులరెడ్డి ఇంటి ముందు టపాసులు కాలుస్తుండటంతో.. ముందుకు వెళ్లి కాల్చాలని ఆయన సూచించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వారు రాళ్లతో దాడి చేసినట్లు బాధితుడు తెలిపాడు. కుటుంబ సభ్యులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి ఆస్పత్రికి చేరుకుని శ్రీనివాసరెడ్డిని పరామర్శించారు. వెంటనే జమ్మలమడుగు సీఐ టి.వి.కొండారెడ్డి, ఎస్ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు.

పునరావాస కేంద్రమే కావాలి


నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

కొండాపురం : గండికోట జలాశయం కింద ముంపునకు గురైన రేగడిపల్లె గ్రామంలో 102 మంది పునరావాస కేంద్రం కావాలని కోరినట్లు జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు తెలిపారు.

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేగడిపల్లె గ్రామంలోని శివాలయంలో గ్రామ నిర్వాసితులతో రెవెన్యూ అధికారులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆర్‌అండ్‌ఆర్ కోరిన వారికి వన్ టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులు తీసుకోవాలని నిర్వాసితులను కోరారు. అందుకు వారు అంగీకారం తెలపకుండా, పునరావాస కేంద్రం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శోభనబాబు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఎయిడ్స్ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో హెచ్‌ఐవీ నియంత్రణ, నివారణ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐసీటీసీ (ఇంటిగ్రేటెడ్ కౌన్సెలింగ్ టెస్టింగ్ సెంటర్) ఏఆర్‌టీ (యాంటీ రిట్రో వైరల్ థెరపీ)తో సమావేశాన్ని నిర్వహించామన్నారు. సామాజిక భాగస్వామ్యం, ప్రభుత్వ అంచనాల లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలు పూర్తి చేసి రాష్ట్రంలో మన జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. అందులో భాగంగా హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు పోషక ఆహారాన్ని అందిస్తున్నామన్నారు. ప్రతి గర్భిణి హెచ్‌ఐవీ పరీక్ష నిర్వహించుకుని, హెచ్‌ఐవీ ఉన్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకుని బిడ్డకు రాకుండా చూసుకోవాలన్నారు. అందుకు గల సదుపాయాలను అందజేయడం జరుగుతుందన్నారు. అలాగే హెచ్‌ఐవీతో జీవిస్తున్న ప్రతి ఒక్కరూ సకాలంలో మందులు వాడుతూ క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకుంటూ యోగా, ధ్యానం, సామాజిక దృక్పథం, మంచి అలవాట్లను కలిగి జీవించాలన్నారు. అన్ని జిల్లాల కంటే వైఎస్సార్ జిల్లా హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టడం వల్ల అన్ని ఇండికేటర్స్‌లో మంచి శాతం సాధించామన్నారు. ఇదే విధంగా అందరూ కలిసి పని చేసి స్వచ్ఛంద సంస్థలు, సామాజిక దృక్పథం కలిగిన సేవా సంస్థలు విరివిగా హెచ్‌ఐవీ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఎస్‌కే ఖాదర్‌బాషా, వైద్యులు ఉమామహేశ్వర్, జిల్లా ప్రోగ్రాం అధికారి భాస్కర్, ఎయిడ్స్ నియంత్రణ మండలి సభ్యులు, అన్ని ఆస్పత్రుల కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఆర్టీపీపీ ఏడీ ఆత్మహత్య

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ)లోని కోల్‌ప్లాంట్‌లో ఏడీగా పని చేస్తున్న హుస్సేన్ సాహెబ్(53) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. హుస్సేన్ సాహెబ్‌కు ఇటీవల ఏఈ నుంచి ఏడీగా పదోన్నతి లభించింది. ఆర్టీపీపీలోని ఈ–టైపు క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. అనారోగ్య సమస్యల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనకు భార్యతోపాటు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై కలమల్ల ఎస్ఐ శివప్రసాద్‌ను వివరణ కోరగా.. ‘ఏడీ హుస్సేన్ సాహెబ్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది. అయితే ఎలాంటి ఫిర్యాదు రాలేదు. ఫిర్యాదు వచ్చిన వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం’ అని ఎస్ఐ చెప్పారు.